
సాక్షి
నారాయణపేట
శనివారం । 27 । జూలై । 2024



జూరాలకు పెరిగిన వరద

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాలకు వరద మరింత పెరిగింది.

వివరాలు 10లో ▸



నగల దుకాణంలో చోరీ

బాలానగర్‌లోని ఓ నగల దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /24.2

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

తలసరి ఆదాయంలో అట్టడుగున పాలమూరు జిల్లాలు

- 'ఉపాధి హామీ' తప్ప ఇతర రంగాల్లో వెనుకబాటు
- జీడీడీపీలో మహబూబ్‌నగర్‌కు పదో స్థానం, చివరి స్థానాల్లో మిగతా జిల్లాలు
- సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడి

ఆదాయం అంతంతే..



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాల పురోగతికి సూచికగా భావించే స్థూల జిల్లా దేశియోత్పత్తి విలువ(జీడీడీపీ)లో ఉమ్మడి పాలమూరు జిల్లాలు వెనుకంజలో ఉన్నాయి. వ్యక్తుల ఆదాయంగా పరిగణించే తలసరి ఆదాయం విషయంలో మహబూబ్‌నగర్ జిల్లా మినహా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మిగతా నాలుగు జిల్లాలు అడుగున ఉన్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారులు, రోడ్ల సాంద్రత విషయంలోనూ నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు నారాయణపేట, గద్వాల, వనపర్తి జిల్లాలు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే అడుగున ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే -2024లో ఈ వివరాలు బహిర్గతమయ్యాయి.

➡ జీడీడీపీలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగతా జిల్లాలతో పోల్చితే ఉమ్మడి పాలమూరు జిల్లాలు వెనకంజలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా 28,960 కోట్ల జీడీపీపీ విలువతో పదో స్థానంలో ఉంది. కాగా.. నాగర్‌కర్నూల్ జిల్లా 19, జోగుళాంబ గద్వాల జిల్లా 26, వనపర్తి జిల్లా 27, నారాయణపేట జిల్లా 30వ స్థానంలో నిలిచాయి.

➡ తలసరి ఆదాయం విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలు వెనకబడ్డాయి. మహబూబ్‌నగర్ జిల్లా మినహా మిగితా జిల్లాల్లో వ్యక్తుల సగటు ఆదాయం తక్కువగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో తలసరి ఆదాయం ఏడాదికి రూ. 2,61,346గా ఉండగా, నారాయణపేట జిల్లాలో తక్కువగా రూ.1,97,539 మాత్రమే ఉంది. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలు సైతం తలసరి ఆదాయంలో వెనుకంజలోనే ఉన్నాయి.

ఉపాధి 'హామీ'లో మెరుగు..




మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పించాల్సిన పనిదినాల విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలు రాష్ట్రంలోని మిగతా జిల్లాల కన్నా మెరుగ్గా ఉండటం విశేషం. ఉమ్మడి జిల్లాలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి కూలీలకు పని దినాలను కల్పించారు. అత్యధికంగా నారాయణపేట జిల్లాలో అధికారులకు 20.5 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించగా 24.0 లక్షల పనిదినాలు కల్పించడంతో లక్ష్యానికి మించి 117 శాతం పనితీరు కనబరిచారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో తక్కువగా 35.1 లక్షల పనిదినాల లక్ష్యానికి గానూ 38.9 లక్షల పనిదినాలు కల్పించి 111 శాతం పనితీరు సాధించారు.

ఉమ్మడి జిల్లాలోని జిల్లాల వారీగా జీడీడీపీ విలువ (రూ. కోట్లలో)

జిల్లా	జీడీడీపీ (రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	28,960
నాగర్‌కర్నూల్	21,277
జోగుళాంబ గద్వాల	14,219
వనపర్తి	14,151
నారాయణపేట	12,980

జిల్లాల వారీగా తలసరి ఆదాయం(రూ.లో)




ఉపాధిహామీ పథకంలో జిల్లాల పనితీరు, వ్యక్తులకు కల్పించిన పనిదినాలు, (లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	పూర్తయింది
నారాయణపేట	20.5	25.0
మహబూబ్‌నగర్	31.5	35.1
వనపర్తి	26.2	29.5
జోగుళాంబగద్వాల	21.8	24.1
నాగర్‌కర్నూల్	35.1	38.9

రోడ్లు, రహదారుల విస్తరణ (ప్రతీ వంద చ.కి.మీ విస్తీర్ణంలో వేసిన రోడ్లు)

రోడ్ల సాంద్రత (కి.మీ.లో)



ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే..



హెక్టారుకు మించి భూమి ఉన్న రైతుల విషయంలో జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలు రాష్ట్రంలోనే వరుసగా 4, 5వ స్థానాల్లో ఉన్నాయి. గద్వాల జిల్లాలో సగటున ఒక రైతుకు 1.08 హెక్టారు భూమి ఉండగా, నారాయణపేటలో 1.03 హెక్టారు భూమిని కలిగి ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్ జిల్లాలో తక్కువగా సగటు రైతు సుమారు 0.83 హెక్టార్ల భూమిని కలిగి ఉన్నాడు.

గృహవిద్యుత్ కనెక్షన్లలో ఆఖరున నాగర్‌కర్నూల్..



జిల్లాల వారీగా గృహవిద్యుత్ కనెక్షన్ల విషయంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో రాష్ట్రంలోనే తక్కువ సంఖ్యలో డొమెస్టిక్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ జిల్లాలో కేవలం 57.7 శాతమే గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 31.8 శాతం వ్యవసాయ, 10.4 శాతం ఇండస్ట్రియల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 69.2 శాతం గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 18 శాతం వ్యవసాయ కనెక్షన్లు, 12.8 శాతం మేరకు ఇండస్ట్రియల్ కనెక్షన్లు ఉన్నాయి.

➡ రోడ్ల సాంద్రత విషయంలోనూ నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే చివరి వరుసలో ఉంది. ప్రతి వంద చ.కి.మీ. విస్తీర్ణంలో ఈ జిల్లాలో 64.6 కి.మీ. మేర మాత్రమే రోడ్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతీ వంద చ.కి.మీ. విస్తీర్ణంలో 101.1 కి.మీ. మేర రోడ్లు విస్తరించగా, వనపర్తిలో 88.1 కి.మీ. జోగుళాంబ గద్వాలలో 85.8 కి.మీ., నారాయణపేట జిల్లాలో 80.9 కి.మీ. మేర రోడ్లు పరచుకుని ఉన్నాయి.

న్యూస్‌రీల్

జోగుళాంబ సన్నిధిలో 'పేట' కలెక్టర్



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శుక్రవారం నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో వారికి ప్రత్యేక పూజలు చేయించారు. ముందుగా బాలబ్రహ్మేశ్వరుడికి అభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం తుంగభద్ర నదిలోని పుష్కరఘాట్‌ను సందర్శించారు. ఈఓ కలెక్టర్‌కి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

నారాయణపేట: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని.. మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ హాస్పిటల్లో డయాలసిస్ పేషెంట్ల కోసం అదనంగా ఏర్పాటు చేసిన ఐదు డయాలసిస్ యూనిట్లను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇదివరకు ఉన్న డయాలసిస్ యూనిట్ల సరిపోక రోగులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అదనంగా మరో డయాలసిస్ యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, ఆసుపత్రిలో మంచినీటి సౌకర్యంతో పాటు విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా వెంటనే యుద్ధప్రతిపదికన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గందే అనసూయ, డయాలసిస్ యూనిట్ ఇంచార్జి లింగప్ప, డాక్టర్లు క్రాంతి కుమార్, భవాని, నాయకులు బండి వేణుగోపాల్, గందే చంద్రకాంత్, కౌన్సిలర్ మహేష్,కోపంగేరి హన్మంతు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ నిధులు విడుదల



సర్వ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో యూనిఫామ్స్ కుడుతున్న సభ్యులు (ఫైల్)

- జిల్లాకు రూ.26.17 లక్షలు
- మహిళా సమాఖ్య ఖాతాల్లో జమ
- ఒక్కో జతకు రూ.50 చొప్పున మంజూరు

నర్వ: సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు 2024–25 వార్షిక ఏడాదిలో విద్యార్థుల యూనిఫామ్స్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఒక జత యూనిఫామ్స్ కుట్టిందుకు అవసరమైన కుట్టు కూలీ చార్జీలను పాఠశాల విద్యాశాఖ (సమగ్రశిక్ష అభియాన్) ప్రాజెక్టు డైరెక్టర్ నిధులు జిల్లాల వారీగా కేటాయించారు. ఒక్కో జతకు రూ.50 వంతున స్వయంసహాయక సంఘాల మహిళలకు అందజేయనున్నారు. ప్రభుత్వం యూనిఫామ్స్ కుట్టేందుకు అవసరమైన వస్త్రాన్ని సరఫరా చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వస్త్రాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారు. ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆ వస్త్రాన్ని అందజేసి యూనిఫామ్స్ కుట్టిస్తారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 13 మండలాలోని 456 పాఠశాలల్లో 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న 52,314 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫామ్స్ అందజేసేందుకు కుట్టు కూలీ కోసం రూ.26,17,300 లక్షలు విడుదల చేస్తూ ఈ నెల 6న, ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలాఉండగా, యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను సర్కారు మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు అప్పగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ)లను ఏర్పాటు చేసింది. గతంలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లు ఉండేవి. వీటి కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ఏఏసీసీ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధిలో మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఏసీసీ అధ్యక్షురాలి పేరుతో సంయుక్త బ్యాంకు ఖాతాలు ప్రారంభించారు. పాఠశాలల అభివృద్ధికి మంజూరు చేసే నిధులను ఈ ఖాతాల్లో జమ చేస్తున్నారు. యూనిఫామ్స్ కుట్టుకూలీ నిధులను సంబంధిత స్వయం సహాయక మహిళా సంఘాల ఖాతాల్లో జమచేసి కుట్టించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మొదట ఒక జత యూనిఫామ్స్ కుట్టించేందుకు అవసరమైన నిధులు విడుదల చేశారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు యూనిఫామ్స్ అందజేసింది.

త్వరలో ఖాతాల్లో జమ చేస్తాం

మొదటి విడతలో ఒక జత దుస్తువులు కుట్టినందున వాటికి సంబంధించి నిధులు విడుదల అయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఖాతాల్లో నిధులు జమయ్యాయి. స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఒక్కో జతకు రూ.50 చొప్పున కుట్టు కూలీ చార్జీలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మహిళా సమాఖ్య ఖాతాల వివరాలను సేకరించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి చేసి వారి ఖాతాల్లో జమచేస్తాం. – రాజేందర్, జీహెచ్ఎం, ఇన్‌చార్జ్ యూనిఫామ్స్ స్టిచింగ్

గుంతల రోడ్డుకు మరమ్మతు



తాయమ్మ ఆలయం వద్ద రోడ్డు మరమ్మతులు



బ్రహ్మణ్‌వాడిలో గుంతలో మట్టి వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బ్రహ్మణ్‌వాడిలో మిషన్ భగీరథ పైపులైన్ వేయడంతో రోడ్డు గుంతలమయం కాగా.. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సునీత సిబ్బందితో మొరం వేయించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా కమిషనర్ సునీత దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన కమిషనర్ వెంటనే ఆ గుంతల్లో మున్సిపల్ సిబ్బందితో మొరం వేయించారు. అలాగే, తాయమ్మ ఆలయం ఎదుట వర్షానికి కోతకు గురైన రోడ్డుకు మొరం వేయించారు. బాపునగర్‌లోని మాజీ కౌన్సిలర్ మతం వెంకట్రాములు ఇంటి దగ్గర ఓపెన్ ప్లేస్‌లో పిచ్చిమొక్కలను తొలగించి, డ్రైనేజీలో చెత్తా చెదారాన్ని తీయించారు. ఆయా సమస్యలను ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకురావడం.. అవి పరిష్కారం కావడంతో 'సాక్షి'కి, మున్సిపల్ కమిషనర్‌కు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కోర్టు డ్యూటీ ఆఫీసర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట రూరల్: నేరస్తులకు తగిన శిక్ష పడేవిధంగా చూసే బాధ్యత కోర్టు డ్యూటీ అధికారులదేనని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జిల్లాలోని అన్ని పీఎస్‌లలో కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసు ఆఫీసర్లకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శుక్రవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్యాప్తు, ప్రాసిక్యూషన్, ఇన్వెస్టిగేషన్ చేయాల్సిన పద్ధతిని వివరించారు. సాక్షులు, నిందితులను కోర్టుకు హాజరు పరిచే విధానం, సకాలంలో కేసులు పూర్తి అయ్యేవిధంగా తీసుకోవాల్సిన చర్యలు తెలియచేశారు. పోలీసు వ్యవస్థపై నమ్మకం కల్పించాలని, కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. కోర్టు సిబ్బందితో సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. సరైన విధానంలో పనిచేస్తే రివార్డులో వస్తాయన్నారు. సమావేశంలో డీఎస్పీ లింగయ్య, ఐటీ కోర్ ఎస్ఐ సునీత పాల్గొన్నారు.

డీజీపీతో వీసీ..

డయల్ 100 కాల్స్‌పై హైదరాబాద్ నుంచి శుక్రవారం డీజీపీ జితేందదర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ యోగేష్‌గౌతమ్ పాల్గొన్నారు. జిల్లాలో డయల్ 100కాల్స్‌కు సంబంధించిన వివరాలు, వాటి మానిటరింగ్, బ్లూకోట్స్, పెట్రోలింగ్ వాహనాల పనితీరుపై ఆరా తీశారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



కన్మనూర్‌లో ఆయిల్‌పాం సాగు చేసిన రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మరికల్: ప్రభుత్వం పోత్సహిస్తున్న ఆయిల్‌పాం తోటల సాగుతో మంచి లాభాలను సాధించవచ్చని కలెక్టర్ సక్తా పట్నాయక్ అన్నారు. మండలంలోని మరికల్, కన్మనూర్‌లో సాగు చేసిన ఆయిల్‌పాం తోటలను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో అధిక శాతం రైతులు ఆయిల్‌పాం తోటల పెంపకంపై దృష్టి సారించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగేళ్ల తర్వాత వచ్చే దిగుబడిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వారిని తోటలు సాగు చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పాం తోటల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం సాగు పద్ధతి వివరాలతో పాటు గెలలు వచ్చే కాల పరిమితి వరకు తోటను ఎలా కాపాడుకోవాలనే అంశంపై రైతులకు వివరించారు. అనంతరం కన్మనూర్‌లోని ఆయిల్‌పాం నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ అధికారులు ఖలీద్, బాల్‌రాజ్, తదితర రైతులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దెల్‌బీడ్, గడిమున్క్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. మద్దెల్‌బీడ్‌లో రైతు లక్ష్మి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 90 శాతం సబ్సిడీతో సాగు చేస్తున్న మామిడితోటలో ఆయన మొక్కలు నాటారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ప్రత్యేక రాయితీలు అందిస్తుందని, మిగతా రైతులు ముందుకు రావాలని సూచించారు. అంతకుముందు మండలంలోని గడిమున్కన్‌పల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీధర్, ఏపీఎం జయమ్మ, పీల్డ్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఊట్కూరు: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ట్రైనీ కలెక్టర్ గరీమా నారుల్లా అన్నారు. శుక్రవారం ఊట్కూరులోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ తదితర రుణాలను అందిస్తుందన్నారు. మహిళలు ప్రభుత్వం ద్వార అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాబివృద్ధి సాధించాలన్నారు. డీఆర్‌డీఓ రాజేశ్వరి, అడిషనల్ డీఆర్‌డీఓ అంజయ్య, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ఏపీఎం నిర్మలపాల్గొన్నారు.

సాగునీటిని వృథా చేయొద్దు



కోయిల్‌సాగర్‌లో పూలు చల్లి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి తదితరులు

దేవరకద్ర: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడి అన్నారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో కలిసి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయడానికి నిధులు కేటాయించిందని, రూ.లక్షలోపు రుణమాఫీ తర్వాత రూ.2 లక్షల వరకు రుణమాఫీని ఆగస్టు 15లోగా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.72,658 కోట్లు కేటాయించి రైతును రాజు చేయాలనేది ప్రభుత్వ ధ్యేయమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా చూపించి ఇప్పుడు ఆ పార్టీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిర్మించి 70 ఏళ్లు గడుస్తున్నా చెక్కు చెదరలేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఏడాదికే పగుళ్లు వచ్చి కుంగిపోయిందని విమర్శించారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అధికారులతో సమావేశాలు పెట్టి, రైతులు నీటిని వదలాలని మొరపెట్టుకుంటే నీటిని వదిలేవారని ఇప్పుడు రైతులు కోరకుండానే పరిస్థితిని గమనించి నీటిని విడుదల చేశామన్నారు. కోయిల్‌సాగర్ కింద ఉన్న పెండింగ్ పనులన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో నారాయణపేట డీసీసీబీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

నారాయణపేట రూరల్: నిలిపివేసిన రూట్లలో బస్సు సర్వీసులను పునఃరుద్ధరించాలని, సమస్యను పట్టించుకోని ఆర్టీసీ డీఎంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సింగారం చౌరస్తాలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోటకొండ రహదారి పనులు జరుగుతున్నాయనే కారణంతో ఆ రూట్‌లో తిరిగే రెగ్యులర్ సర్వీసులు నిలిపివేయడంతో బండగొండ, తిర్మలాపూర్, కోటకొండ, అభంగాపూర్, బొమ్మన్‌పాడు, అమ్మిరెడ్డిపల్లి తదితర గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో చోట్ల రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నా బస్సులు, భారీ వాహనాలు నడుస్తున్న నేపథ్యంలో ఈ రూట్‌లో మాత్రమే ఉద్దేశపూర్వకంగా డీఎం నిర్లక్ష్యంగా వాటిని నిలిపివేయడం సరికాదన్నారు. వాహనాలు నిలిచిపోవడంతో సీఐ అలివేలమ్మ సంఘటన స్థలానికి చేరుకుని రెండు రోజుల్లో బస్సులను పునరుద్ధరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, సురేష్, లక్ష్మణ్, విఠల్, మోహన్, లక్ష్మీకాంత్, రేణుక, నందిని, చరన్, దీప, భవాని, లక్ష్మీకాంత్, అశోక్, భూమిక పాల్గొన్నారు.

క్లుప్తంగా

బొలెరో వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం


సాయితేజ(ఫైల్)

భూత్పూర్: పట్టణంలోని జడ్చర్లకు వెళ్లే దారిలో శుక్రవారం బొలెరో వాహనం, బైక్‌ను ఢీకొనడంతో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని శేరిపల్లి(హెచ్)కి చెందిన ఎ.సాయితేజ(21) బైక్‌పై భూత్పూర్ చౌరస్తా నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్నాడు. భూత్పూర్‌లోని ఇంటర్నల్ రోడ్డుపై టీఎస్07 యూఎఫ్ 0259 నంబరు బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో సాయితేజ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన తీరును పట్టణ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తిమృతి

- పొలం పనులు చేస్తుండగా ఘటన



నాగర్‌కర్నూల్ క్రైం: వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శ్రీపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సింగారపు స్వామి (33) తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో అదికాస్తా బురదలో ఇరుక్కుని ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దీంతో స్వామి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. స్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనకుపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

బస్సు దిగుతూ కిందపడిన మహిళ

- తీవ్ర గాయాలై.. చికిత్స పొందుతూ మృతి


పెంటమ్మ(ఫైల్)

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారానికి చెందిన మహిళ ఆర్టీసీ బస్సు నుంచి కిందకు దిగే క్రమంలో గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవల్లి మండలంలోని చెన్నారానికి చెందిన పెంటమ్మ(49) గురువారం సాయంత్రం ఆమె కుమారుడు శశాంక్‌తో కలిసి తన సొంత అక్క గంగమ్మను చూసేందుకు తాడిపర్తికి ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. తాడిపర్తి స్టేజీ వచ్చిన తర్వాత దిగేందుకు చూడగా.. డ్రైవర్ బస్సును ముందుకు పోనిచ్చాడు. బస్సు కదిలి ముందుకు వెళ్లడంతో తొందరలో పెంటమ్మ బస్సు దిగింది. అప్పటికే బస్సు ముందుకు కదలడంతో పెంటమ్మ కిందపడి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ఆమెను స్థానికులు వనపర్తికి అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పెంటమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

నీటికుంటలో పడి వృద్ధురాలి మృతి

మహమ్మదాబాద్: నీటి కుంటలో పడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోస్గి మండల కేంద్రం బహార్‌పేట్‌కు చెందిన కావలి వెంకటమ్మ(75) కొంత కాలంగా కల్లుకు బానిసై అనారోగ్యం పాలైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కల్లు ప్రమాదమని తాగకూడదని తెలియజేశారు. దీంతో ఆమె అప్పటి నుంచి పిచ్చిచేష్టలు చేసేది. మూడు రోజుల కిందట కోస్గిలో బస్సు ఎక్కి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకి లభించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మహమ్మదాబాద్ బీరప్ప ఆలయం ఎదుట తిప్పిరేణికుంటలో పడి మృతిచెందింది. మృతదేహాన్ని చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. ఆమె వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాం. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలియజేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: భూతగాదాలో దాడికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. ఈ నెల 19న తూడుకుర్తికి చెందిన నాగేషును తన అన్న కుమారుడు రాంబాబు పొలం వద్దకు వచ్చి భూతగాదాల విషయంలో గొడ్డలితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆరు రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

జూరాలకు పెరిగిన వరద


నెట్టెంపాడు ఎత్తిపోతల లిఫ్టు-1 వద్ద కొనసాగుతన్న నీటి పంపింగ్

- ప్రాజెక్టుకు 2,65,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 36 క్రస్టు గేట్ల ఎత్తివేత.. దిగువకు 2,53,290 క్యూసెక్కులు విడుదల

ధరూరు/ దోమలపెంట/ మదనాపూర్/ ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాలకు వరద మరింత పెరిగిందని పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రాజెక్టుకు 2,49,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 2,53,290 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 10 యూనిట్ల ద్వారా 19,668 క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. జూరాల 36 క్రస్టు గేట్ల ద్వారా 2,30,283 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 37, కుడి కాల్వ ద్వారా 437, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, భీమా లిఫ్టు-1కు 1,300, లిఫ్టు- 2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2,53,290 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.340 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు 2,07,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2,75,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 82.509 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2,75,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 25 గేట్లు ఎత్తి 2,90,322 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 26.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ముమ్మరంగా విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ క్రమంలో శుక్రవారం 10 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎగువ జూరాలలో 5 యూనిట్లు, దిగువ జూరాలలో ఐదు యూనిట్ల ద్వారా 56 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు వివరించారు.

శ్రీశైలంలో 861.0 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో 8.61.0 అడుగుల వద్ద 109.0060 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల ఆనకట్ట గేట్లు, విద్యుదుత్పత్తి చేస్తూ లో ఆనకట్ట వద్ద 36 గేట్లు పైకెత్తి స్పీల్‌వే ద్వార 2,49,951 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 7,286 క్యూసెక్కులు కలిపి మొత్తం 2,57,237 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 9,921 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు.

సుంకేసుల వైపు పరుగులు

శాంతినగర్/ రాజోళి: కర్ణాటక పరిధిలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. టీబీ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 105.885 అడుగులకు చేరడంతో గురువారం 28 గేట్లు ఎత్తి దిగువకు వదిలారు. దీంతో టీబీ డ్యాం నుంచి విడుదల చేసిన నీరు శుక్రవారం ఆర్డీఎస్ ఆనకట్టకు చేరడంతో 12.2 అడుగులకు చేరింది. దీంతో ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఓవర్ ఫ్లో కొనసాగుతుండటంతో కర్ణాటక నీటిపారుదలశాఖ అధికారులు ఆర్డీఎస్ కాల్వ గేట్లు ఎత్తి 470 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నీరు రాష్ట్ర సరిహద్దులోని సింధనూర్ వద్దకు శనివారం మధ్యాహ్నం వరకు చేరే అవకాశం ఉందని ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

2 గేట్లు ఎత్తివేత..

రాజోళి శివారులో ఉన్న సుంకేసుల బ్యారేజీకి ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వరద వస్తున్నందున శుక్రవారం రెండుగేట్లు ఎత్తి 7,286 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు. అలాగే 1,540 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేశామన్నారు.


ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద దిగువకు పారుతున్న వరద నీరు

రీజియన్‌కు 100 కొత్త బస్సులు

- ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్


మాట్లాడుతున్న ఈడీ పురుషోత్తం నాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న రోజుల్లో ఆర్టీసీకి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సంస్థ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం రీజియన్‌స్థాయి ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రీజియన్‌కు 100 కొత్త బస్సులు కేటాయించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాకు చెందిన సుమారు 180 మంది డ్రైవర్లు ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారని.. కొత్త బస్సుల రాకతో వారు తిరిగి ఇక్కడికి వచ్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. త్వరలోనే అన్ని విభాగాల్లో నియామకాలు జరుగుతాయని తెలిపారు. రీజియన్ 2022, నవంబర్ నాటికి రూ.56 కోట్ల నష్టాల్లో ఉండగా 2023, నవంబర్‌లో రూ.26 కోట్ల లాభాల్లోకి వచ్చిందని.. అధికారులు, ఉద్యోగుల కృషితోనే సాధ్యమైందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మెరుగైన సేవలు అందించాలని కోరారు. రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి మాట్లాడుతూ.. రీజియన్‌లో 800 సర్వీసులుండగా, సుమారు 600 సర్వీసులు మంచి ఆదాయం తీసుకొస్తున్నాయని తెలిపారు. అంతకుముందు ఉత్తమ ప్రతిభ కనబర్చిన వివిధ డిపోలకు చెందిన 10 మంది డ్రైవర్లు, 10 మంది కండక్టర్లు, ఐదుగురు పీహెచ్‌బీ డ్రైవర్లు, ఇద్దరు మెకానిక్‌లు, ఒక శ్రామిక్‌ను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా ఉత్తమ బస్‌స్టేషన్‌గా నాగర్‌కర్నూల్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఈడీ పురుషోత్తం నాయక్‌ను అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు శ్యామల, లక్ష్మి ధర్మ, మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత, ఇతర డిపో మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

నాగర్‌దొడ్డిలో జపాన్ శాస్త్రవేత్తల బృందం


నాగర్‌దొడ్డి సమీపంలో పత్తి పంటను పరిశీలిస్తున్న జపాన్ బృందం

మల్దకల్: బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జపాన్ శాస్త్రవేత్తల బృందం డా. అరుణ్, ఇనాగాకి, వివాసకి కోరారు. శుక్రవారం మండలంలోని నాగర్‌దొడ్డిలో స్పీడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రవిప్రకాష్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు రైతులతో మాట్లాడారు. బడిఈడు పిల్లలతో వ్యవసాయ, సీడ్ పత్తి పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తల్లిదండ్రులతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమవంతుగా కృషి చేస్తున్నాయని తెలిపారు. చిన్నారుల బంగారు భవిష్యత్‌కు ప్రతి ఒక్కరూ బాటలు వేయాలని కోరారు. అనంతరం గ్రామ సమీపంలో సాగు చేసిన పత్తి పంటలను పరిశీలించి ఆశించే చీడపీడలు.. నివారణకు తీసుకుంటున్న చర్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ సాగుతో భూమి సారవంతంగా మారడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే పంటలను సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం నాగర్‌దొడ్డి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రవిప్రకాష్, మధులత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నగల దుకాణంలో చోరీ

- ముసుగు ధరించిన నలుగురు దొంగలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండల కేంద్రంలోని ఓ నగల దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున నలుగురు ముసుగు ధరించిన దొంగలు దుకాణం రెండు షటర్లను పైకెత్తి అందులోని పది కిలోల వెండితో పాటు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బాలానగర్ మండల కేంద్రంలో కేశరావ్ చౌదరి(క్రిష్ణా) క్రిష్ణా నగల దుకాణాన్ని రోజు మాదిరిగా గురువారం రాత్రి 8 గంటలకు మూసి ఇంటికి వెళ్లిపోయాడు. మధ్యరాత్రి నలుగురు ముసుగు ధరించిన దొంగలు, నగల దుకాణంలోకి ఉన్న విద్యుత్ సర్వీస్ వైర్‌ను కట్ చేశారు. షెటర్‌ను కట్ చేస్తే.. ఎవరైనా చూస్తారని, అనుమానం రాకుండా, బాలానగర్ మండల కేంద్రంలోని రాందేవ్ కిరాణం దుకాణం ఎదుట, కిరాణ దుకాణానికి చెందిన మారుతి వ్యాన్‌ను తీసుకొచ్చారు. షెటర్‌కు అడ్డుగా పెట్టి షెటర్‌ను పైకెత్తారు. ఆ సమయంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విధులు ముగించుకుని బాలానగర్ మండల కేంద్రానికి వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. షెటర్ పైకెత్తి ఉన్న విషయాన్ని గమనించాడు. దుకాణం ఎదుట ఓ వ్యక్తి నిలబడి ఉండగా.. మీరు ఎవరు షెటర్ పైకెత్తి ఉందని ప్రశ్నించాడు. నీవు ఇక్కడి నుంచి వెళ్లిపో, లేకుంటే చంపేస్తా అని సదరు వ్యక్తి భయపెట్టాడు. దీంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడి నుంచి కొద్ది దూరంలోని పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి.. డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునే లోపే.. అక్కడే ఉన్న మారుతీ వ్యాన్‌లో దొంగలు పారిపోయారు. రాజాపూర్ శివారులోని ఓ దాబా వద్ద వ్యాన్‌ను అక్కడే వదిలేశారు. అక్కడి నుంచి మరో వాహనంలో వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం అక్కడికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఫింగర్ ప్రింట్స్, సీసీ పుటేజీల్లో నలుగురు ముసుగు ధరించిన వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలియజేశారు. బాలానగర్ ఎస్‌ఐ తిరుపాజి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

నగదు అపహరణ

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన బాలకృష్ణ స్థానిక రామాలయం ఎదురుగా సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇదివరకు ఉన్న కౌంటర్ తాళం పోగొట్టుకుపోవడంతో కొత్తగా కౌంటర్ చేయించాడు. పాత కౌంటర్‌ను మూడు రోజుల కిందట బాలకృష్ణ బామర్ది రవి గ్రామమైన అమడబాకులలో వేసేందుకు గణేష్ అనే వ్యక్తికి చెందిన ఆటోను పిలిపించి కౌంటర్‌ను అమడబాకులకు పంపించాడు. పాత కౌంటర్‌లో డబ్బులు ఉన్న విషయం బాలకృష్ణకు, అతని భార్య మానస, ఆటో డ్రైవర్ గణేష్‌కు మాత్రమే తెలుసు. శుక్రవారం మధ్యాహ్నం కౌంటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొడుతుండటంతో రవి భార్య ప్రియాంక గమనించి ఆందోళనకు గురై భర్త రవికి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అంతే కాకుండా 100కు ఫోన్ చేసింది. కౌంటర్‌లో రూ.77 వేల డబ్బులు ఉన్నాయని ఆ నగదును కౌంటర్ పగలగొట్టి దోచుకెళ్లినట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేష్‌పై అనుమానం ఉందని, నగదును అతనే దోచుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి జిల్లా కేంద్రం నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగల వేలిముద్రలను సేకరించారు.

జోగుళాంబ సన్నిధిలో మహిళా నాగసాధువు


నాగసాధువును సన్మానిస్తున్న ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శుక్రవారం రాత్రి మహిళా నాగసాధువు అఘోర్య దర్శించుకున్నారు. శరీరం నిండా ధూని బూడిద, నుదుటిపై తిలకం, త్రిశూలంతో దిగంబరంగా ఆలయానికి చేరుకోగా ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ సాదరంగా స్వాగతం పలికారు. ఉభయ ఆలయాలను దర్శించుకున్న అనంతరం మాట్లాడారు. జోగుళాంబ అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని.. శక్తిపీఠం రాష్ట్రంలో ఉండటం విశేషమన్నారు. తనది మంచిర్యాల అని.. చిన్న వయసులోనే నాగసాధువు అఘోర్యగా మారానని, గురువు దగ్గర దీక్ష తీసుకున్నానని చెప్పుకొచ్చారు. ధర్మాన్ని కాపాడేందుకు, లోకకల్యాణార్థం తమిళనాడులో ట్రస్టు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సనాతన హిందూ ధర్మంపై దాడులు పెరుగుతున్నాయని.. కాపాడుకునేందుకు భారతదేశంలో 21వ మహిళా నాగసాధువు అఘోర్యగా తాను బయటకు వచ్చానని తెలిపారు. హిందూ ధర్మం గొప్పదని కొనియాడారు.

ఉపాధిహామీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం


అగ్నిప్రమాదంలో కాలి బూడిదయిన రికార్డులు, ఎంబీలు, ఫర్నీచర్

తెలకపల్లి: మండల కేంద్రంలోని యోగా భవనం వద్ద ఉన్న ఉపాధిహామీ కార్యాలయంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఉపాధిహామీకి సంబంధించిన ఎంబీలు, మస్టర్లు, తీర్మానాలకు సంబంధించిన పత్రాలు, విలువైన రికార్డులతో పాటు ఫర్నీచర్, టేబుల్స్ దగ్ధమయ్యాయి. ఉదయం కార్యాలయానికి వెళ్లిన అటెండర్ మల్లేష్ గమనించి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఓ మల్లేష్, ఉపాధి సిబ్బంది చేరుకుని పరిశీలించారు. మధ్యాహ్నం డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవం

ధన్వాడ: హత్యకేసులో కొండాపూర్‌నకు చెందిన అనంతయ్యకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, రూ. 21 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్‌కి చెందిన మల్లంగారి లక్ష్మారెడ్డి(29) వద్ద అనంతయ్య రూ.1.40 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కాగా తన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు లక్ష్మారెడ్డి అనంతయ్యను అడిగాడు. కాగా అతడు డబ్బులు ఇస్తానని లక్ష్మారెడ్డిని పొలానికి సమీపంలో ఓ వాగు వద్దకు తీసుకెళ్లి మద్యం సేవించి, మత్తులో ఉండగా కర్ర, రాయి, కొడవలితో దాడి చేసి హతమార్చాడు. ఘటనపై లక్ష్మారెడ్డి అన్న వెంకటరెడ్డి స్థానిక పోలీసులకు ఫిబ్రవరి 5, 2023న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ రమేష్, సీఐ శ్రీకాంత్‌లు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అనంతయ్యను పట్టుకుని అతడిపై చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కోర్టులో నిరూపణ కావడంతో అనంతయ్యకు శిక్ష పడింది.

భార్యను చంపిన ఘటనలో మరో వ్యక్తికి..

గోపాల్‌పేట: భార్యను చంపిన ఘటనలో ఓ వ్యక్తికి శుక్రవారం జిల్లా సెషన్స్ కోర్టు జీవితఖైదు విధించిందని రేవల్లి ఎస్‌ఐ రాము తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2020 సంవత్సరంలో రేవల్లికి చెందిన మల్లేష్, అతడి భార్య గొడవ పడ్డారు. ఈ క్రమంలో మల్లేష్ తన భార్యను గడ్డపారతో పొడవగా ఆమె మరణించింది. ఈమేరకు ఆమె తరుపు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు. కోర్టులో ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువడినట్లు ఎస్‌ఐ వివరించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



భూత్పూర్: భూత్పూర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం లారీ ఢీ కొనడంతో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. మున్సిపాలిటీలోని సిద్దాయిపల్లికి చెందిన వెంకట్రాము పట్టణంలోని బ్రిడ్జి వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో వెంకట్రాములు కాలుకు తీవ్ర గాయాలు కాగా.. 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని పేకాట స్థావరంపై శుక్రవారం దాడి చేసి 7గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన 7గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురు పట్టుబడినట్లు నలుగురు పరారీలో ఉన్నారని, 7 గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రగతిశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

- భక్తి పేరుతో బీజేపీ ప్రజలను మభ్యపెడుతోంది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు యం.బాల్‌నర్సింహా


మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దేశంలో భక్తి పేరుతో బీజేపీ ప్రజలను మభ్యపెడుతోందని, ప్రగతి శీల ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు యం.బాల్‌నర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విష్ణు కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల సమితి సభ్యుల రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ముందుగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం భక్తి పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవడమే అన్నారు. పట్టణాలు, గ్రామాల్లో పండుగల పేరుతో ప్రజలను ఏకం చేయడానికి స్వార్థ ప్రయోజనాలే కారణమన్నారు. సీపీఐ కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి బీజేపీ ఎత్తుగడలను పసిగట్టి అడ్డుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. త్యాగాలు చేస్తూ స్వార్థ ప్రయోజనాలకు దూరంగా, ప్రజా సమస్యలే ఎజెండాగా పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్న సీపీఐ కార్యకర్తలను అభినందించారు. దేశ సమైక్యతకు భంగం కలిగించే వారిపట్ల లౌకికవాదానికి కట్టుబడి నిరంతరం కమ్యూనిస్టులు పనిచేస్తూనే ఉంటారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనరాదని చేసిన చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దేశంలో అసమానతలు సృష్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు బీఎస్‌ఆర్.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థిక పరిస్థితి పర్యావసనాలపై వివరించారు. ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పి లక్ష్మణ్ మాట్లాడుతూ రాజకీయ స్థితిగతులు, నాయకత్వ లక్షణాలపై వివరించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ కమ్యూనిస్టు మ్యానిఫెస్టో అనే అంశంపై మాట్లాడారు. ఆయా జిల్లాల కార్యదర్శులు బాలకిషన్, కె.విజయరాములు, కొండన్న, బి.ఆంజనేయులు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు పి.సురేష్, రాము, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మేన్‌కు విద్యుదాఘాతం

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న జూనియర్ లైన్‌మెన్ విద్యుదాఘాతానికి గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సుంకరాంపల్లికి చెందిన మహేందర్ విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. శాఖాపూర్ శివారులో ఇటుక బట్టీలు నిర్వహించే చోట సదరు నిర్వాహకులు కరెంటు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో మహేందర్ దిమ్మెపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ కనెక్షన్‌ను తొలగించేందుకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకుని విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తుండగా, ఒక్కసారిగా విద్యుదాఘానికి గురయ్యాడు. దూరం నుంచి గమనించిన విద్యుత్ సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లారు. విద్యుత్‌శాఖ ఏఈ అరుణ్‌నాయక్, ఎల్ఎం నరేందర్, గోవిందు బాధితుడిని కారులో ఎనుగొండలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మహేందర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు.

బడ్జెట్‌లో స్పోర్ట్స్‌కు రూ.325 కోట్లు కేటాయింపు

- సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన శాట్ చైర్మన్ శివసేనారెడ్డి



వనపర్తి: గత పదేళ్లలో ఎన్నడూలేని విధంగా క్రీడాభివృద్ధి కోసం స్పోర్ట్స్ అథారిటీకి బడ్జెట్‌లో రూ.325 కోట్లు కేటాయించటం హర్షణీయమని శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శాలువా, పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహకారంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్/కరెస్పాండెన్స్ అన్నిరకాల డిగ్రీ,PG, B.Tech ,Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు 8660977112, 339 [HA-16328]

SERVICES

CHANGE OF NAME

■ I CHIKKONDLA SHIVAIAH @ SHIVA KUMAR CHIKONDLA S/o CHINNAIAH CHIKKONDALA, CHANDAPUR VILLAGE, WANAPARTHY MANDAL & DIST, నా భార్య పాస్‌పోర్టు నందు నా పేరు SHIVAKUMAR CHIKONDLA గా ఉన్నది. కావున నా పేరు CHIKKONDLA SHIVAIAH గా మార్చబడినది. [J-1267323]

OLD AGE HOME

■ శ్రీసత్యహోమ్స్ వృద్ధులకు, పేషెంట్స్‌కు, వంటరివారికు, వసతి / ఇంటివద్ద 24 గం॥లు చూసుకోవడానికి స్టాఫ్ ఇవ్వబడును. హైదరాబాద్ ఫోన్: 7996557700, 7996758877 [H-796261]

WANTED

■ ఒమేగా హోంకేర్ వందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ: 20 K. ఫోన్: 8977839982, 8977839983 [H-796259]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్